

63 అడుగుల శ్రీరాముడి విగ్రహం

● 23న ఆవిష్కరణకు సిద్ధం



ఆవిష్కరణకు సిద్ధమైన శ్రీరాముడి విగ్రహం

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో భారీ శ్రీరాముడి విగ్రహావిష్కరణకు అంతా సిద్ధమయ్యింది. రాజాజీనగర్ శ్రీరామమందిరంలో 63 అడుగులతో నిర్మించిన శ్రీరాముడి విగ్రహాన్ని ఈ నెల 23న ఆవిష్కరించనున్నట్లు రామసేవా మండలి నిర్వాహకులు ప్రకటించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడిన సభ్యులు సోమవారం నుంచి బుధవారం దాకా ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు. ఉడుపి పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థస్వామీజీ, ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. పలువురు రాజకీయ నాయకులు, సినిమా నటులు పాల్గొంటారన్నారు. సమావేశంలో మాగడి కెంపేగౌడ అభివృద్ధి సమితి అధ్యక్షుడు హెచ్ఎస్ కృష్ణమూర్తి, శ్రీరామసేవామండలి అధ్యక్షుడు కేఎస్ శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు మోహన్‌కుమార్, జయరత్న, శిల్పి జీవన్ శివమొగ్గలు పాల్గొన్నారు.

స్థానిక అభ్యర్థులకు

సవాల్..!



● ఓటర్లను కాపాడుకోవడమే ముఖ్యం ● నేతలకు క్రాస్ ఓటింగ్ టెన్షన్ ● ప్రాధాన్యతా ఓటుతో పార్టీల్లో భయం.. భయం.. ● నేడు దక్షిణకన్నడ-ఉడుపి ఎమ్మెల్సీ ఎన్నిక

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ-ఉడుపి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల నేతలకు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం కంటే ఓటర్లను కాపాడుకోవడమే సవాల్‌గా మారింది. ప్రధాన అభ్యర్థులను క్రాస్ ఓటింగ్ భయమే వెంటాడుతోంది. ఉడుపి-దక్షిణకన్నడ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన కోట శ్రీనివాసపూజారి విధానపరిషత్‌లో కీలకనేతగా వ్యవహరించారు. ఆయన ఉడుపి-దక్షిణ కన్నడ లోక్‌సభ స్థానం నుంచి గెలుపు సాధించడంతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి. రెండు జిల్లాల పరిధిలో 6,011 ఓట్లు ఉన్నాయి. బీజేపీ నాయకులు చెప్పుకుంటున్నంతగా 1600కు పైగా ఓట్లు వారికే అనుకూలంగా ఉన్నాయి. ఇదే భరోసాతో గెలుపు సాధ్యమనే ధీమాలో ఆ పార్టీ నేతలున్నారు. రెండు జిల్లాల పరిధిలో అత్యధిక ఓటర్లు గ్రామపంచాయతీ సభ్యులే ఉన్నారు. వీరిని కట్టడి చేయడం అంత సులువు కాదు. పార్టీ గుర్తు లేకపోవడం, ప్రాధాన్యతా పరమైన ఓటు కావడంతో వారి ఓట్లు పొందడం సవాల్‌గా మారింది. ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులతోపాటు నాయకులు ప్రచారం ద్వారా పార్టీలతో సంబంధం లేకున్నా అందరి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం కంటే ఉన్న ఓట్లను సంరక్షించుకుంటే చాలనే పరిస్థితి ఏర్పడింది. బీజేపీ నుంచి కిశోర్‌కుమార్ బోట్యాడి, కాంగ్రెస్ నుంచి రాజు పూజారి బరిలో ఉన్నారు. వీరితోపాటు ఇండిపెండెంట్లుగా దినకర్ ఉల్లాల్, ఎస్‌డీపీఐ నుంచి అన్వర్ సాదాత్‌లు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు అనుభవంతోపాటు బలమైన వారే. కానీ ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాల్లో మతపరమైన వివాదాలకు కొదవ లేదు. ఎస్‌డీపీఐ పార్టీ రాష్ట్రంలో దక్షిణకన్నడ జిల్లాలోనే ప్రాబల్యం కలిగి ఉంది. ఇలా ఎస్‌డీపీఐకు ఓట్లు పడే అవకాశం ఉంది. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యతా ఓటు కంటే ద్వితీయశ్రేణిలో అభ్యర్థులు గెలుపొందిన సందర్భాలు ఉన్నాయి. ఆ భయం కూడా రెండు పార్టీలను వెంటాడుతోంది.

నేడు పోలింగ్

ఉడుపి-దక్షిణకన్నడ స్థానిక సంస్థల కోటాలో విధానపరిషత్ స్థానానికి సోమవారం పోలింగ్ జరగనుంది. ఆదివారం పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఎన్నికల సామగ్రితో తరలివెళ్లారు. రెండు జిల్లాల్లో భారీ వర్షాలు ఉండడంతో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయమే అధికంగా పోలింగ్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 6,032 ఓట్లు ఉండగా వీరిలో మహిళలు 3,127, పురుషులు 2,905 మంది ఉన్నారు. ఎన్నికలను రెండు జిల్లాల బీజేపీ, కాంగ్రెస్ ముఖ్యనాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గొడవలు చెలరేగే అవకాశం ఉందని భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 13 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరుగుతుండగా 392 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

అభ్యర్థుల్లో భయం.. భయం

తమ పార్టీ సభ్యులు ఓట్లు వేస్తామని బహిరంగంగా మద్దతు ఇస్తున్నా అంతర్గతంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడతారనే భయం రెండు పార్టీల అభ్యర్థులను వెంటాడుతోంది. శాసనసభ నియోజకవర్గాలవారీగా ఇన్‌చార్జ్‌లను ప్రతి గ్రామపంచాయతీ, బూత్ స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి ఓటరును నిరంతరం అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే తరుణంలోనే ప్రత్యర్థి అభ్యర్థులు లేదా వారి అనుచరులు ఏవైనా ప్రలోభాలకు గురి చేస్తారేమోనని ఆందోళనతోనే నిఘా కొనసాగిస్తున్నారు.





వీడని చిక్కుముడి..!

● చన్నపట్టణ అభ్యర్థి కోసం బీజేపీ, జేడీఎస్ కసరత్తు ● పట్టువీడని కుమారస్వామి

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలు జరిగే మూడు స్థానాల్లో శిగ్గావి, సండూరు స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల పేర్లను దాదాపు కొలిక్కితెచ్చినట్లు తెలుస్తోంది. ఉప ఎన్నికల్లో చన్నపట్టణ స్థానం మాత్రం కీలకంగా మారింది. ఇక్కడనుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన జేడీఎస్ పార్టీ నేత కేంద్ర మంత్రి కుమారస్వామి స్థానాన్ని వదులుకునేందుకు సుముఖంగా లేకపోవడంతో పొత్తు నేతలకు తలనొప్పిగా మారింది. బీజేపీ-జేడీఎస్ పార్టీల మధ్య పొత్తు ఉండడంతో టిక్కెట్ ఖరారు చేసే అంశంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా సీపీ యోగేశ్వర్ పోటీ చేస్తే రసవత్తంగా మారతాయనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే యోగేశ్వర్ మూడు నెలల కాలంగా ప్రచారం చేస్తున్నారు. యోగేశ్వర్‌కు టిక్కెట్ ఇవ్వాలని బీజేపీలోని ఓ వర్గం డిమాండ్ చేస్తోంది. ఎన్నో ఏళ్లకాలంగా పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారని ఆయనకు టిక్కెట్ ఇవ్వడం సముచితమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే జేడీఎస్‌కు చెందిన స్థానం కావడంతో వారికే వదిలిపెట్టడం సమంజసమనే చర్చ జరుగుతోంది. పార్టీ సీనియర్ నేత యడియూరప్ప స్పందిస్తూ అది జేడీఎస్‌కు చెందిన స్థానమనే వ్యాఖ్యలు పార్టీలో వైరల్ అయ్యాయి. మరోవైపు జేడీఎస్ గెలిచే అవకాశం లేనందున బీజేపీకి వదిలిపెట్టాలన్న ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి. కుమారస్వామి చన్నపట్టణ నుంచి కుమారుడు నిఖిల్‌ను పోటీ చేయించాలని భావించారు. అయితే ప్రత్యర్థి డీసీఎం డీకే శివకుమార్ సోదరుడైతే కష్టమవుతుందనే వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. భార్య అనితాను అభ్యర్థి చేసే విషయంలోనూ కుమారస్వామి ఆచి-తూచి వ్యవహరిస్తున్నారు. ఆదివారం చన్నపట్టణ అభ్యర్థి ఖరారు విషయమై కుమారస్వామితోపాటు బీజేపీ నేతలతో కీలక సమావేశం జరిగింది. ఇదే సందర్భంలో సీపీ యోగేశ్వర్ పోటీకి అభ్యంతరం లేదంటూనే జేడీఎస్ టిక్కెట్ ద్వారా బరిలోకి నిలపాలని మెలిక పెట్టారు. యోగేశ్వర్ జేడీఎస్ నుంచి పోటీ చేసే విషయంలో ఖరారు చేయలేదు. బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిని ఖరారు చేసేంతవరకు కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించకూడదని తీర్మానించింది. డీసీఎం డీకే శివకుమార్, స్థానిక నాయకులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే పార్టీ కార్యకర్తల్లో డీకే సురేశ్‌ను అభ్యర్థి చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. నామినేషన్‌ల దాఖలు ప్రారంభమై రెండు రోజులు ముగిసింది. కాగా శిగ్గావి నుంచి కాంగ్రెస్ తరపున రాజేశ్వరి పాటిల్‌కు టిక్కెట్ దాదాపు ఖరారు కానుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే స్థానం నుంచి మాజీ మంత్రి ఆర్ శంకర్ కూడా టిక్కెట్‌ను ఆశిస్తున్నారు.



రాజకీయాల్లోకి మరో వారసుడు

● శిగ్గావి బీజేపీ అభ్యర్థిగా భరత్ బొమ్మై ప్రకటనతో మరో యువ నేతకు అవకాశం

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వారసత్వ రాజకీయాల పట్ల విమర్శలు చేయడం సాధారణమే అయినా ప్రతి పార్టీలోనూ ప్రముఖ నేతలు తమ వారసులను తెరపైకి తీసుకొస్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే సామెత రీతిలో అన్ని పార్టీల ప్రముఖ నేతలదీ అదే తీరు. రాష్ట్రంలో ఇటీవల రెండు దశాబ్దాలకాలంలో ముఖ్యమంత్రులుగా వ్యవహరించినవారిలో ఎక్కువమంది వారసులను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. అదే కోవలోనే ఏడాదిన్నర క్రితం దాదాపు మూడున్నరేళ్లపాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్‌బొమ్మైకి హావేరి జిల్లా శిగ్గావి ఉప ఎన్నికల్లో పార్టీ టిక్కెట్‌ను దక్కించుకున్నారు. పారిశ్రామికవేత్తగా కొనసాగుతున్న భరత్ తొలిసారిగా టిక్కెట్ దక్కడంతో క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చినట్లయ్యింది. ఇప్పటివరకు పార్టీ సభలు, సమావేశాలతోపాటు ఇతరత్రా ఎక్కడా కనిపించని భరత్‌కు టిక్కెట్ వరించింది. ప్రస్తుతం సీఎంగా వ్యవహరిస్తున్న సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర ఇప్పటికే ఎమ్మెల్యేగా పని చేయగా తాజాగా ఎమ్మెల్సీ అయ్యారు. ఇక యడియూరప్ప ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన తర్వాత చిన్నకుమారుడు విజయేంద్రను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. అప్పటికే పెద్ద కుమారుడు రాఘవేంద్ర ఎంపీగా వ్యవహరిస్తుండగా విజయేంద్ర 2023 ఎన్నికల్లో సుదీర్ఘకాలం యడియూరప్ప ప్రాతినిథ్యం వహించిన శికారిపుర నుంచి ఎమ్మెల్యే అయ్యారు. ఇక కేంద్రమంత్రి కుమారస్వామి తనయుడు నిఖిల్ రాజకీయాల్లో ఉన్నారు. అయితే ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేసి ఓటమి చెందారు. ఇలా రెండు దశాబ్దాలుగా ముఖ్యమంత్రిగా వ్యవహరించినవారిలో ఎక్కువమంది వారసులు క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇక జగదీశ్‌శెట్టర్, సదానందగౌడ వారసులు మాత్రమే దూరంగా ఉన్నారు.





రాష్ట్రంలో కొనసాగుతున్న వానలు

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాల ప్రభావం కొనసాగుతోంది. ఆదివారం ఉదయం నుంచి బెంగళూరు సహా వివిధ జిల్లాల్లో జోరు వాన కురిసింది. తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు నమోదు కాగా పశ్చిమ కనుమల జిల్లాలతోపాటు మైసూరు, మండ్య, హాసన్, కొడగు జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిశాయి. బెంగళూరులో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం కూడా వర్షం కురిసింది.

దీపావళికి ఏపీకి ప్రత్యేక బస్సులు

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకోసం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పట్టణాలకు బెంగళూరు నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఏటీఎం రవీంద్రరెడ్డి తెలిపారు. ఈమేరకు నగరంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ, నెల్లూరు, కర్నూలు, కడప, ప్రొద్దుటూరు, చిత్తూరు, అనంతపురం, తిరుపతితోపాటు బెంగళూరు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు నడుపుతున్న సర్వీసులకు అదనంగా బస్సులను ఏర్పాటు చేశామన్నారు. పండుగ రద్దీ నేపథ్యంలోనూ సాధారణ చార్జీలతోనే ప్రయాణించే వెసలుబాటు ఉందన్నారు. ఈనెల 30న ప్రత్యేక సర్వీసులు ఉంటాయన్నారు. ముందస్తుగా రిజర్వేషన్ సదుపాయం ఉందని, రానుపోను టిక్కెట్‌లు రిజర్వు చేసుకుంటే 10శాతం రాయితీ ఉంటుందన్నారు.

బీజేపీ వ్యూహం.. అనూహ్యం..

● గాలి మాటే చెల్లుబాటయ్యిందా..?

● ఊహించని రీతిలో హనుమంత పేరు ఖరారు

● ఊపందుకున్న సండూరు ఉప ఎన్నిక పోరు

బళ్లారి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సండూరు శాసనసభ ఉప ఎన్నిక పోరు ఊపందుకుంది. అభ్యర్థిని ఎంపిక చేయడంలో బీజేపీ ప్రత్యేక వ్యూహం పన్నింది. కాంగ్రెస్‌తో పాటూ బీజేపీ నాయకులు కూడా ఊహించని వ్యక్తిని రంగంలోకి దించారు. అందరూ అనుకున్నట్లు జేఎస్ దివాకర్ లేదా మాజీ ఎంపీ దేవేంద్రప్ప పేర్లు గట్టిగా వినిపించాయి. అదీ కాకపోతే మాజీ మంత్రి శ్రీరాములు పేరు కూడా ఉండొచ్చని అనుకున్నారు. బీజేపీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. బంగారు హనుమంత పేరును శనివారం ఖరారు చేసి ఆశ్చర్యంలో ముంచింది. హనుమంత తండ్రి సొంతూరు హొస్పేట్ జిల్లా. వృత్యరీత్యా ఆయన కేఎస్ఆర్‌టీసీ డ్రైవర్. కూడ్లిగిలో స్థిరపడ్డారు. వాల్మీకి సముదాయానికి చెందిన హనుమంత రాజకీయాల్లో చురుకుగా ఉంటున్నారు. ముందు నుంచి అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి శ్రీరాములుకు అత్యంత ఆప్తుడిగా ఉన్నారు. 2023లో శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి విశ్వప్రయత్నం చేశారు. కానీ అప్పటి వరకూ అనుకూలంగా ఉన్న శ్రీరాములు అతడిని కాదని లక్ష్మన్ననాయకను సిఫార్సు చేశారు. టిక్కెట్ రాకపోవడానికి కారకుడయిన శ్రీరాములుతో రాజకీయంగా విభేదిస్తూ వచ్చారు. అదేపార్టీలో కీలక నాయకులుగా ఉన్న విజయేంద్ర, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఇతర ఎమ్మెల్యేలతో పాటు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఎస్టీ కార్యవర్గ సభ్యుడిగానూ కొనసాగుతున్నారు. గాలి జనార్దన్‌రెడ్డి తనకు అనుకూలంగా ఉండే జేఎస్ దివాకర్‌ను ప్రతిపాదిస్తున్నారని అందరూ భావించారు. కానీ జనార్దన్‌రెడ్డి అంతర్గతంగా హనుమంతను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. హనుమంతకు పార్టీ అధిష్టానం పెద్దలతో పరిచయాలు ఉండడం కూడా కలిసొచ్చింది. గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు మధ్య దూరం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో రాజకీయంగా శ్రీరాములుకు శత్రువు అయిన బంగారు హనుమంతకు మద్దతు ఇచ్చి ఎత్తుగడ వేశారని ప్రచారం జరుగుతోంది. పార్టీ పరంగా హనుమంత ముందు నుంచి పట్టు ఉన్న నాయకుడే. కొందరు కాంగ్రెస్ నాయకులతో కూడా స్నేహసంబంధాలు కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి బి. నాగేంద్ర అరెస్టు అయి జైల్లో ఉన్నపుడు కూడా ఆయనతో హనుమంతు ములాకత్ అయ్యారని సమాచారం. నాగేంద్ర గతంలో గాలి గ్రూపులో ఉన్నప్పటి నుంచి హనుమంతతో పరిచయం ఉందని తెలుస్తోంది. బీజేపీ అభ్యర్థి ఎంపిక విషయంలో కొత్త ఎత్తుగడ వేసిందని విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.



సండూరు బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత

నటుడు సుదీప్‌కు

మాతృవియోగం

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది ప్రముఖ నటుడు కిచ్చ సుదీప్‌కు మాతృవియోగం అయ్యింది. వయోసహజ సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుదీప్ తల్లి సరోజ సంజీవ్ ఆదివారం ఉదయం మృతి చెందారు. జయనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండేవారు. సుదీప్ తల్లి సరోజ మృతి చెందిన విషయం తెలియగానే సినీ రంగానికి చెందిన పలువురు ఆసుపత్రికి తరలివచ్చారు. మధ్యాహ్నం జేపీ నగర్‌లోని సుదీప్ నివాసానికి భౌతికకాయాన్ని తరలించారు. అభిమానుల సందర్శనకోసం అక్కడే ఉంచారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై జేపీనగర్‌లోని సుదీప్ నివాసానికి వెళ్లి సరోజ సంజీవ్ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం సుదీప్‌ను ఓదార్చారు. సినీరంగానికి చెందిన దర్శక నిర్మాతలు, సహనటులు, ఆయన అభిమానులు, గతంలో బిగ్‌బాస్‌లో పాల్గొన్న పలువురు సంతాపం తెలిపారు. సినిమాలతోపాటు బుల్లితెరపై బిగ్‌బాస్ హోస్ట్‌గా సుదీప్ సుపరిచితుడు. శనివారం రాత్రి బిగ్‌బాస్ షోలో తల్లిని గుర్తు చేసుకున్నారు. అంతలోనే ఆమె దూరం కావడంతో విషాదంలో మునిగారు. సంజీవ్ నిర్మాత కాగా సరోజ సంజీవ్‌ల దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలతోపాటు సుదీప్ ఉన్నారు.



సరోజ (ఫైల్)



సుదీప్‌ను ఓదారుస్తున్న మాజీ సీఎం బొమ్మై



ఆరబోసిన ఉల్లి

భారీ వర్షాలకు కుళ్లిన ఉల్లి

బళ్లారి సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలు ఓ వైపు కొంత ఊరటనిస్తున్నా.. కొందరు రైతులు కోలుకోని విధంగా నష్టపోతున్నారు. చేతికి వచ్చిన పంటలు నీట పాలై కుళ్లిపోతుండడంతో కన్నీరు పెట్టుకుంటున్నారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్లిలో 150 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పండిన ఉల్లి కుళ్లిపోవడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. హొసపేటలో వందలాది ఎకరాల్లో కోతకు వచ్చిన వరి కూడా నాశనమైంది. హరపనహళ్లి తాలూకాలో ఐదుఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కానహొసళ్లి సమీపంలోని హులికెర సరస్సుకు గండి పడింది. కోతకు వచ్చిన ఉల్లి కుళ్లిపోయింది. తాలూకాలోని వివిధ గ్రామాల్లో 130 మంది రైతులకు చెందిన 150ఎకరాల పైగా ఉల్లి కుళ్లిపోయింది. చేతికి వచ్చిన పంట నోటికి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన శాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ రెవెన్యూ, ఉద్యానవన శాఖల సంయుక్త సర్వే తర్వాత కచ్చితమైన నష్టాల సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు.



ఉల్లికుప్పలోకి చేరిన వర్షపునీరు

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయాధికారి



సూచనలిస్తున్న జిల్లా న్యాయాధికారి

హిందూపురం, అక్టోబరు 20: స్థానిక సబ్‌జైలును జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ ఆదివారం తనిఖీ చేశారు. ఖైదీలతో వారు చేసిన నేరాలపై ఆరాతీశారు. సబ్‌జైలులో కానిస్టేబుల్ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదాసీనంగా వ్యవహరిస్తున్న జైలు అధికారిని మందలించారు. పద్ధతి మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని న్యాయాధికారి హెచ్చరించారు.

పోలీసు భవన సముదాయం పరిశీలన

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పోలీసు భవన్ సముదాయాన్ని న్యాయాధికారి పరిశీలించారు. ఈ స్థలాన్ని పోలీసు శాఖతోపాటు బార్ అసోసియేషన్‌కు కేటాయించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. హిందూపురంలో కోర్టు కోసం భవనాన్ని పరిశీలించారు. బహువిధ పశువైద్యశాలలో పైరెండంతస్తులను పరిశీలించారు. వెటర్నరీ డీడీ కార్యాలయాన్ని సైతం పరిశీలించారు. కోర్టు నూతన భవనం నిర్మించేవరకు తాత్కాలిక భవనం వాడుకుంటామని సంబంధిత అధికారులకు న్యాయాధికారి సూచించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, హిందూపురం జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ, సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి లలితాలక్ష్మి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళ హత్య?



గంగమ్మ మృతదేహం

అనంతపురం క్రైం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎర్రనేల కొట్టాల సమీపంలోని మహాత్మాగాంధీ కాలనీలో శనివారం రాత్రి ఓ మహిళ హత్యకు గురైంది. కాలనీలో నివాసముంటున్న గంగమ్మ(50) తన పేరు నాగమ్మగా చెప్పుకుంటోంది. శెట్టూరు మండలం ఉప్పువంకకు చెందిన ఈమె 20 ఏళ్ల కిందట భర్త, పిల్లలను వదిలేసి అనంతపురానికి వచ్చి స్థిరపడింది. ఆమె రామచంద్ర నగర్‌లోని నీలిమా థియేటర్ సర్కిల్ సమీపంలోని ఓ హోటల్‌లో పని చేస్తోంది. హోటల్‌లో శనివారం ఉదయం 11గంటలకు పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు ఆదివారం ఉదయం హోటల్ యజమాని రమేష్ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఇంటి యజమానికి ఫోన్ చేసి విషయం తెలిపాడు. యజమాని ఆమె ఇంటి వద్దకు వెళ్లి చూడగా బెడ్‌పై నిస్తేజంగా పడిఉన్న నాగమ్మ కనిపించింది. ఆమె ముక్కునుంచి రక్తం కారడం చూసి వెనక్కు వచ్చి, హోటల్ యజమాని, పోలీసులకు సమాచారం అందించాడు. జిల్లా ఎస్పీ జగదీశ్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ శాంతిలాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించారు. డాగ్ ఇంటిపై నుంచి కింది వరకు వచ్చి కొంత దూరం వెళ్లి తిరిగి వచ్చింది. త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారంపొడి చల్లిన దుండగులు

హత్యకు గురైన గంగమ్మ ఏడాది కిందటి వరకు అదే కాలనీలోని మూడు సందుల అవతల ఇంట్లో అద్దెకు ఉండేది. ప్రస్తుతం మరో ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఆమె ఇక్కడ పూజలు చేసేదని, స్వామి పూనకం వచ్చేదని స్థానికులు చెబుతున్నారు. ఆమెపై అత్యాచారం జరిగి ఉంటుందనే అనుమానాలు రేకెత్తాయి. పోస్టుమార్టంలో అవేవీ లేవని, గొంతు నులిమి హత్య చేసి ఉండవచ్చని తేలినట్లు సమాచారం. స్థానికంగా ఆమెకు పరిచయమున్న వారే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అయితే అది వివాహేతర సంబంధమా..? లేక ఆర్థిక వ్యవహారమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు పాల్పడిన వారు కారం పొడి చల్లడం అనుమానాలకు తావిస్తోంది. కుక్క ఆ వాసన గుర్తు పట్టకుండా ఉండేందుకే ఇలా చేసినట్లు పోలీస్‌వర్గాలు భావిస్తున్నాయి. హత్యలో పాల్గొన్నది ఒకరా, ఇద్దరా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. గంగమ్మ మృతి సమాచారాన్ని కుమారులకు అందించారు. వారు వచ్చాకే పోస్టుమార్టం నిర్వహించారు. భర్త నాగప్ప కొన్నేళ్ల కిందటే మృతి చెందినట్లు తెలిసింది.

మున్సిపాలిటీకి ఇచ్చేయండి

తల్లి మృతదేహం తీసుకెళ్లడానికి ఆమె ఇద్దరు కుమారులు అంగీకరించలేదు. ఆమె కూలి పనులు చేయలేక లగ్జరీ కోసమని మమ్మల్ని చిన్నప్పుడే వదిలేసి వచ్చింది. అలాంటి ఆమెను తీసుకెళ్లలేమంటూ ఆ కొడుకులు విముఖత చూపారు. మున్సిపాలిటీ వారికి ఇచ్చేయండి వారే చూసుకుంటారంటూ పోలీసులకు చెప్పారు. అలా అంటారేంటి ఎంతయినా ఆమె మీ కన్నతల్లి అంటూ సీఐ శాంతిలాల్ నచ్చచెప్పారు. దీంతో బాడుగకు కూడా మా వద్ద డబ్బు లేవంటూ ముఖం చిట్లించారు. దీంతో మేమే బాడుగ ఇస్తాం అని చెప్పి, మృతదేశాన్ని ఇచ్చి పంపారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ జగదీశ్

ఉచిత సిలిండర్లు ఎవరికో..?

- దీపావళి నుంచి పంపిణీకి అడుగులు
- ఆర్భాటంగా కూటమి నేతల ప్రకటనలు
- లబ్ధిదారుల ఎంపికపై సందేహాలు
- మార్గదర్శకాలు రాలేదంటున్న యంత్రాంగం



అనంతపురం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు శుభవారం చెబుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా మూడు సిలిండర్ల పంపిణీకి అడుగులు వేస్తోంది. ఇప్పటికే పింఛన్లు పెంచారు. దీపావళికి సిలిండర్లు పంపిణీ చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీనిపై కూటమి పార్టీల నేతలు సమావేశాల్లో ప్రజలకు చెబుతున్నారు. ఎవరెవరికి ఉచితగ్యాస్ సిలిండర్లు అందజేస్తారనే దానిపైనే ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఇంకా మార్గదర్శకాలు రాలేదని పౌర సరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 12,54,911 కనెక్షన్లు

అనంత ఉమ్మడి జిల్లాలో 12,54,911 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని పౌర సరఫరాల శాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఇందులో జనరల్ కనెక్షన్లు 7,48,218 ఉండగా, దీపం పథకం కింద 4,09,764, అంత్యోదయ సామాజిక బాధ్యత కింద ఇందన కంపెనీలకు సంబంధించి 68,451, ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద 28,478 కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.869 ఉంది.

ఈకేవైసీనే కీలకమా..?

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో లబ్ధిదారుల ఈకేవైసీనే కీలకమనే అభిప్రాయాలు అధికార యంత్రాంగం ద్వారా తెలుస్తోంది. అందుకే ప్రభుత్వం కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరి నుంచి ఆధార్ ఆధారంగా ఈకేవైసీ చేయించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో మూడు నెలలుగా లబ్ధిదారుల నుంచి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఈకేవైసీ చేయిస్తూ వస్తున్నారు. ఈకేవైసీ చేయించడం వల్ల లబ్ధిదారుడికి సంబంధించిన ఆదాయం, ఆస్తుల స్టేటస్ తెలుసుకోవచ్చు. తెల్లకార్డు ఉన్నవారందరికీ ఈ సిలిండర్లు అందజేస్తారా అనే దానిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆశా, అంగన్‌వాడీల్లో ఉత్కంఠ

గత వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ప్రకటించింది. తమకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ఆ వర్గాల వారు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఉచిత సిలిండర్లు తమకు వర్తింపజేస్తారో లేదోనని వారు ఉత్కంఠగా చూస్తున్నారు.

మార్గదర్శకాలు రాలేదు: వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

ఉచితగ్యాస్ సిలిండర్ల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు దానికి సంబంధించిన మార్గదర్శకాలు రాలేదు. అవి వచ్చిన తర్వాతనే ఎవరెవరికి సిలిండర్లు పంపిణీ చేస్తామో తెలుస్తుంది. ఎపుడు ఆదేశాలు వచ్చినా మార్గదర్శకాల మేరకు పంపిణీ చేపట్టడానికి అన్నిరకాలుగా సిద్ధంగా ఉన్నాం.

యథేచ్ఛగా ఎర్రమట్టి దోపిడీ

- కొండలను కరిగించి
- సొమ్ము చేసుకుంటున్న మాఫియా
- పట్టించుకోని అధికారులు



ఎక్స్‌కవేటర్ ద్వారా కొండను కరిగిస్తున్న దృశ్యం

నార్పల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్న కొందరు అక్రమార్కులు కొండలను కరిగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రమైన నార్పలలోని సరిహద్దుల్లో ఎర్రమట్టి కొండలు చాలా ఉన్నాయి. కొందరు ఎర్రమట్టి దొంగలు రూ. లక్షలు సంపాదించడానికి మాఫియాగా మారారు. ఎర్రమట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా నార్పల మండలమే కాకుండా ఇతర మండలాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు నాయకులు, అధికారులు వారి నెల మామూళ్లు సర్దుబాటు చేసుకుని ఎర్రమట్టి మాఫియాకు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. కొండలను ఇష్టానుసారంగా ఎక్స్‌కవేటర్లతో తవ్వేసి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా విక్రయిస్తున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. నార్పలలో కొన్ని కొండలను తవ్వి ఎర్రమట్టిని తరలించడం కోసం కొందరు ఎర్రమట్టి మఫియా సభ్యులు ఇటీవల ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఒక ట్రాక్టర్ తెచ్చుకున్న వ్యక్తి ఎర్రమట్టిని తరలిస్తే రోజుకు రూ.10వేలు వరకు సంపాదిస్తున్నాడని సమాచారం. ఈ ఎర్రమట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లు, పాతబావులు, గుంతలు, చౌడు భూములు, తోటలు, రోడ్లకు ఎక్కువగా వాడుతున్నారు. ఎర్రమట్టి తరలించే మాఫియాలో వైసీపీకి చెందిన వారే ఉన్నట్లు సమాచారం. ఈ విషయం గురించి తహసీల్దారు అరుణకుమారిని వివరణ కోరగా.. అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలా ఎవరైనా కొండల నుంచి ఎర్రమట్టిని తరలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు.



నార్పలలో ట్రాక్టర్‌తో ఎర్రమట్టిని తరలిస్తూ...

అడ్డేలేని అక్రమాలు..!

- కనిపించని రికార్డులు
- సొసైటీల కంప్యూటరీకరణతో వెలుగులోకి..
- నకిలీ పాసుబుక్కులతో రుణాలు
- అనంతలో 48, శ్రీసత్యసాయిలో 65 శాతమే ఆన్‌లైన్
- ఓటర్లు 15 లక్షలు.. ఖాతాదారులు 80 వేలు..
- కొలిక్కిరాని ప్రక్రియ
- కొత్త రుణాలు ఇవ్వడంలో ఆలస్యం



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఇచ్చిన రుణాల్లో అక్రమాలకు అడ్డేలేకుండా పోయింది. సొసైటీల కంప్యూటరీకరణతో రికార్డులు లభించడం లేదని తెలుస్తోంది. సుమారు ఐదేళ్లుగా సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ సాగిస్తున్నప్పటికీ నేటికీ కొలిక్కిరావడం లేదు. దీంతో సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. అనంతపురం జిల్లాలో 48 శాతం, శ్రీసత్యసాయి జిల్లాలో 65 శాతం సొసైటీల కంప్యూటరీకరణ పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో 107 సొసైటీలలో 15 లక్షల మంది ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 80వేల మంది మాత్రమే రైతులు ఖాతాదారులుగా ఉన్నట్లు సహకార శాఖ, ఏడీసీసీ బ్యాంకు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయితే ఇంకా చాలా అవినీతి, అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. ఇందులో నకిలీ పట్టాలు, బోగస్ రుణాలు తేలనున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో జరుగుతున్న నిర్లక్ష్యం, జాప్యంతో అర్హులైన రైతులకు రుణాలు ఇవ్వడంలో ఆలస్యమవుతోంది. సమస్యను పరిష్కరించేదిశగా జిల్లా యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. గతంలో ఇష్టానుసారంగా నకిలీ పాసుబుక్కులకు రుణాలు చెల్లించారు. దీంతోనే రికార్డులను మాయం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినా అధికారులు దీనిపై దృష్టి సారించలేదనే విమర్శలు ఉన్నాయి.

15 లక్షల ఓటర్లు.. 80 వేలే ఖాతాదారులు..

ఉమ్మడి జిల్లాలో 107 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (సొసైటీలు) ఉన్నాయి. వీటిలో సుమారు 15 లక్షల మందికి పైగా ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 80వేల మంది మాత్రమే పంట రుణాలు తీసుకున్నారు. చాలా వరకు నకిలీ, బోగస్ ఓటర్లు ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. గ్రామస్థాయిలోకి వెళితే సొసైటీలలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంతో అర్హులైన రైతులకు రుణాలు చెల్లించడం ఆలస్యమవుతోంది.

వేగవంతంగా కంప్యూటరీకరణ

ప్రభుత్వ ఆదేశాల మేరకు సొసైటీల కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం. పలు రికార్డులు లభించడం లేదని కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నారు. నకిలీ, బోగస్ అని తెలిస్తే వెంటనే నోటీసులు ఇస్తున్నాం. నోటీసుల ద్వారా సంబంధిత రుణాలు తీసుకున్న వారి నుంచి స్పష్టత తీసుకుంటున్నాం. రికార్డులు లేకపోతే కచ్చితంగా సంబంధిత సొసైటీలు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తే సొసైటీల పారదర్శకత, రుణాల చెల్లింపుల్లో అక్రమాలను ఏరిపారేయవచ్చు.

-అరుణకుమారి, కృష్ణానాయక్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల డీసీఓలు



నాట్యంతో అలరిస్తున్న అలా వేణుగోపాల్

నెమలికి నేర్పిన నడకలివి..

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం మొదటి రోడ్డులోని త్యాగరాజ సంగీత సభలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన 'అంకురం శాస్త్రీయ సంగీత నృత్య వేడుకలు' వీక్షకుల్లో నాట్యానందాన్ని నింపాయి. కార్యక్రమానికి చిన్మయామిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కేరళకు చెందిన నృత్యకళాకారిణి అలా వేణుగోపాల్ శాస్త్రీయ సంగీతానికి సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో సంగీతసభ అధ్యక్షుడు ఎస్‌సి సంపత్‌కుమార్, ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, కవి కంబదూరి షేక్ నబిరసూల్, దాసరి హరిశ్చంద్రరామ తదితరులు పాల్గొన్నారు.

కరువు తీరా నీరు

బోరు బావి నుంచి ఉబికి వస్తున్న జలం

కనగానపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కరువు సీమలో పాతాళం నుంచి జలం ఉబికి వస్తోంది. బోరు బావిలో నుంచి మోటరు ఆన్ చేయకనే నీరు ఉబికి వస్తుండంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండంతో కనగానపల్లి మండలం తూంచెర్ల గ్రామంలో దోబీఘాట్ కోసం వేసిన బోరుబావి నుంచి నీరు ఉబికి వస్తోంది. కరువు తీరేలా భూగర్భ జలాలు పెరగడంతో రైతులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తూంచెర్ల గ్రామంలో బోరుబావిలో వస్తున్న నీరు

మెరిట్ జాబితాపై అభ్యంతరాలు చెప్పండి

అనంతపురం విద్య, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన విడుదల చేసిన తాత్కాలిక మెరిట్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీలోగా తెలియజేయాలని సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించామన్నారు. స్క్రూట్నీ తర్వాత అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను సమగ్రశిక్ష బ్లాగ్ స్పాట్ http : //samagrashikshaatp.blogspot.comలో అందుబాటులో ఉంచామన్నారు. జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 4 గంటల్లోపు సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

ఇంకెవరు చెప్పాలి..?



- మంత్రి చెప్పినా మారని పెద్దాస్పత్రి తీరు
- సకాలంలో అందని రిపోర్టులు, వైద్యసేవలు
- పేద రోగులకు తప్పని తిప్పలు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది కూడేరు మండలం అరవకూరుకు చెందిన పెద్దయ్య. ఊపిరి ఆడకపోవడం, ఛాతీలో తీవ్రనొప్పితో నడవడానికి ఇబ్బంది పడుతున్న అతడిని భార్య, మరొకరు కలిసి ఆటోలో జిల్లా ఆస్పత్రికి శనివారం తీసుకొచ్చారు. ఓపీ చీటీ తీసుకొని డాక్టర్ వద్దకు వెళ్లగా పరీక్షించి మాత్రలు రాసిచ్చి పంపించారు. అయినా బాధ తగ్గకపోవడంతో అడ్మిట్ చేసుకోమని అడిగారు. ఇప్పుడు బెడ్లు ఖాళీలేవు, సోమవారం రండి అని డాక్టర్ చెప్పారంట..! దీంతో ఆయన భార్య 'ఇదేమి ఆస్పత్రిసారూ చచ్చిపోతున్నా పట్టించుకోరా? అని వాపోయింది. మాఖర్మ, ఆరోజే వస్తాం అంటూ ఉబికి వస్తున్న కన్నీటి అదిమిపెట్టుకుంటూ వెళ్లిపోయింది.



ఈమె పేరు లక్ష్మీదేవి. ఊరు తాడిపత్రి. ముక్కులు మూసుకుపోవడంతో ఊపిరి తీసుకోవడానికి అవస్థలు పడుతోంది. చికిత్స కోసం శుక్రవారం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. డాక్టరమ్మ పరీక్షించి సీటీస్కాన్ తీయించుకొని రమ్మని రాసిచ్చారు. అదేరోజే స్కానింగ్ చేశారు. కానీ రిపోర్టు ఇవ్వలేదు. దీంతో తాడిపత్రికి వెళ్లి శనివారం మళ్లీ ఆస్పత్రికి వచ్చి సీటీ స్కానింగ్ సెంటర్ వద్ద కాచుకున్నారు. అప్పటికీ రిపోర్టు సిద్ధం కాలేదు. అడిగితే సోమవారం రమ్మన్నారట. డాక్టరమ్మేమో స్కానింగ్ రిపోర్టు చూసిన తర్వాతేమందులు రాసిస్తానంటున్నారు. వీళ్లు చూస్తూ రిపోర్టుకు రేపుమాపు అంటూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



ఇక్కడ కనిపిస్తున్న ఇద్దరు మహిళల చిన్నపిల్లలు అనారోగ్యంతో చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్నారు. అక్కడ ఏవో పరీక్షలు చేయించాలని డాక్టరు రాసిచ్చారు. నర్సులు రక్త నమూనాలు తీసి ల్యాబ్ ఇచ్చిరావాలని చెప్పారట. దీంతో వారు శాంపిల్స్‌ను తీసుకుని బయోకెమిస్ట్రీల్యాబ్ వద్దకు వచ్చారు. అక్కడి వారు ఈ శాంపిల్స్ ఇక్కడ కాదు 19 ఓపీలోని మైక్రోబయాలజీలో ఇవ్వాలని చెప్పారట. అక్కడనుంచి అందరినీ ఆవార్డు ఎక్కడుందని అడుక్కుంటూ ఆ మహిళలు వెళుతూ కనిపించారు.

మంత్రి చెబుతున్నా..

అనంతపురం టౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి)

ఆస్పత్రికి వచ్చిన ప్రతిరోగికి సకాలంలో వైద్యసేవలు అందాలని, ఎట్టి పరిస్థితులలోను బయటకు పంపకూడదు. ఏమైన పరీక్షలు, స్కానింగ్ రిపోర్టులను ఏరోజుకారోజే పేషెంట్లకు అందించి సంబంధిత డాక్టర్లతో అవసరమైన వైద్యచికిత్సలు పొందేలా చూడాలి. ఇవీ రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ పెద్దాస్పత్రిలో చెప్పిన మాటలు. ఇవి విన్న రోగులు, వారి బంధువులు మంత్రి చెప్పారు కాబట్టి ఇక మీదట ఆస్పత్రి సిబ్బంది తీరు మారుతుందని ఎంతో సంబరపడ్డారు. కానీ ఆస్పత్రిలో పనితీరుమాత్రం ఏమాత్రం మారలేదు.

రిపోర్టుల జారీపై తీవ్ర నిర్లక్ష్యం

డాక్టర్లు వివిధ స్కానింగ్‌లు తీయించుకొని రావాలని పేషెంట్లకు రాస్తున్నారు. అల్ట్రాసౌండు, సీటీస్కాన్, ఎంఆర్ఐ తదితర పరీక్షలు ఇందులో చాలా కీలకం. ఈరిపోర్టులు వస్తేగానీ పేషెంట్లకు అవసరమైన చికిత్సలు అందించడానికి వీలుకాదని డాక్టర్లు అంటున్నారు. అందుకే రిపోర్టులను సకాలంలో అందించి, అదేరోజు వచ్చిన పేషెంట్లకు చికిత్స అందేలా చూడాలని వైద్యమంత్రి ఆదేశించారు. కానీ ఇక్కడ ఆస్పత్రిలో మంత్రి చెప్పిన ప్రకారం రిపోర్టులు రోగులకు అందించడం లేదు. దీనికి కారణం అల్ట్రాసౌండు, సీటీస్కాన్, ఎంఆర్ఐ పరీక్షలు రోజుకు ఇన్ని మాత్రమే చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. లక్ష్యానికి మించి పేషెంట్లు స్కానింగ్‌లకు రావడం వల్ల సమయానికి ఇవ్వలేకపోతున్నామని ఆయా విభాగాల వైద్యులు, సిబ్బంది అంటున్నారు. ఈసమస్య పరిష్కారమవ్వాలంటే మరిన్ని మెషీన్లు, వైద్యులు, సిబ్బంది అవసరమని చెబుతున్నారు.

ఇష్టారాజ్యంగా ల్యాబ్ రిపోర్టులు

సీజనల్ వ్యాధులు, ప్రసవాలకు వచ్చే వారు, ఇతర విభాగాలలో అడ్మిషన్ పొంది చికిత్స పొందుతున్న రోగులకు వివిధ రకాల రక్త పరీక్షలు ఎంతో అవసరం. ఆస్పత్రిలో రోజుకు 2వేలకు పైగా బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ ల్యాబ్‌లకు రక్త పరీక్షల కోసం శాంపిళ్లు వస్తున్నాయంటే రోగుల తాకిడి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. ల్యాబ్‌టెక్నీషియన్లు. ల్యాబ్‌అసిస్టెంట్లు, ల్యాబ్ అటెండర్లు రక్త పరీక్షల శాంపిళ్లు తీసుకొని, ల్యాబ్ రిపోర్టులను సంబంధిత విభాగాల డాక్టర్లకు అందించాలి. కానీ ఇక్కడ ఆస్పత్రిలో ల్యాబ్‌కు సంబంధించిన అసిస్టెంట్లు, అటెండర్లు ఎక్కడ ఉంటారో తెలియ డం లేదు. శిక్షణకు వచ్చిన విద్యార్థులతోనే ఈపనులన్నీ చేయిస్తున్నారు. ఇంకోవైపు ఇన్‌పేషెంట్లు ఉన్నవార్డులకు ప్రత్యేకంగా డ్యూటీలు వేస్తారు. ఆయా విభాగాల డాక్టర్లు పేషెంట్లకు ఏమైనా పరీక్షలు రాస్తే ఆల్యాబ్ అసిస్టెంట్ రక్తం శాంపిల్ తీసుకొని, ఆయనకానీ, అటెండర్‌తోగానీ ల్యాబ్‌కు పంపించాలి. ఈ ఆస్పత్రిలో చాలా విభాగాలలో అలా చేయడంలేదు, నర్సులే రక్తం శాంపిల్ తీసి రోగి బంధువుల ద్వారా ల్యాబ్‌లో ఇచ్చిరావాలని పంపిస్తున్నారు. దీంతో రోగి బంధువులు ఎక్కడ ఆ శాంపిల్ ఇవ్వాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ శాంపిల్‌కు వేసిన లేబుల్ మారితే సరికొత్త సమస్యలు వస్తాయి. ఇప్పటికే అనేక సార్లు ఒకరి రిపోర్టు మరొకరికి ఇచ్చిన సందర్భాలు అనేకం బయటపడ్డాయి. అయినా ఈరక్త శాంపిళ్ల విషయంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తుండటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ వద్ద రోగుల తాకిడి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌయ్...

ఆల్ఫ్రెడ్ నోబెల్ (జయంతి)



ప్రపంచ ప్రఖ్యాత 'నోబెల్ పురస్కారం' స్వీడిష్ దేశానికి చెందిన ఆల్ఫ్రెడ్ బెర్న్‌హార్డ్ నోబెల్ పేరిట ఏర్పాటైంది. ఆయన 1833 అక్టోబరు 21న జన్మించారు. రసాయన శాస్త్రవేత్త, ఇంజనీర్, ఆవిష్కర్త, వ్యాపారవేత్త. బోఫోర్స్ సంస్థచే ఆయుధాలను తయారు చేశారు. 355 పేటెంట్‌లు కలిగారు. డైనమైట్ ఆవిష్కర్త. 'నోబెల్ బహుమతి' స్థాపనకొరకు పెద్దమొత్తంలో ధనాన్ని సమకూర్చారు. భౌతిక, రసాయన, వైద్య ఆర్థికశాస్త్రాలతోపాటు సాహిత్య, శాంతి కోసం విశేషకృషి చేస్తున్నవారికి నోబెల్ పురస్కారం ఇస్తున్నారు. 1896 డిసెంబరు 10న కన్నుమూశారు.

షమ్మికపూర్ (జయంతి)



బాలీవుడ్ ప్రముఖ నటులలో ఒకరైన షమ్మికపూర్ 1931 అక్టోబరు 21న జన్మించారు. 1950-70లమధ్య 200కుపైగా హిందీ సినిమాలో నటించారు. డైరెక్టర్‌గాను రాణించారు. ఎల్విస్ ప్రెస్లీ ఆఫ్ ఇండియాగా పేరొందారు. రాష్ట్రీయ గౌరవ్ అవార్డు, ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ యాక్టర్ అవార్డు, జీవితసాఫల్య పురస్కారం, ఫిక్కీ నుంచి లివింగ్ లెజెండ్ అవార్డుతోపాటు పలు పురస్కారాలు పొందారు. 2011 ఆగస్టు 14న కన్నుమూశారు.

డాక్టర్ సుర్జీత్‌సింగ్ బర్నాలా (జయంతి)



పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 1985 నుంచి 1987 వరకు వ్యవహరించిన డాక్టర్ సుర్జీత్ సింగ్ బర్నాలా 1925 అక్టోబరు 21న హర్యానాలో జన్మించారు. తమిళనాడు, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులకు గవర్నర్‌గా వ్యవహరించారు. కేంద్రమంత్రిగా వివిధశాఖల్లో కొనసాగారు. రాజకీయ నాయకుడిగానే కాక రచయితగా, చిత్రకారుడిగాను రాణించి ప్రత్యేకత చాటుకున్నారు. 2017 జనవరి 14న కన్నుమూశారు.

ఉర్సులా కె లిగూన్ (జయంతి)



అమెరికాకు చెందిన నవలా రచయిత్రి ఉర్సులా కె లిగూన్ 1929 అక్టోబరు 21న కాలిఫోర్నియాలో జన్మించారు. ఫాం టసీ, సైన్స్ ఫిక్షన్ రచనల్లో పేరొందారు. 20కుపైగా నవలలు, 100 చిన్నకథలు రాశారు. ఆమె రచనలు 40కుపైగా భాషలలోకి అనువాదం అయ్యాయి. వరల్డ్ సైన్స్ ఫిక్షన్ సొసైటీ వంటి పురస్కారాలు, ఐదు హ్యూగో అవార్డులు, గాండాల్ఫ్ అవార్డు, నెబ్యులా అవార్డులు పొం దారు. 2018 జనవరి 22న కన్నుమూశారు.

ముత్తుస్వామి దీక్షితులు (వర్ధంతి)



కర్ణాటక సంగీతత్రయంలో ఒక రైన వాగ్గేయకారుడు, వీణ విద్వాంసుడు ముత్తుస్వామి దీక్షితర్ 1775 మార్చి 24న తంజావూరు జిల్లా తిరువారూర్‌లో జన్మిం చారు. అద్వైత తత్వాన్ని సంగీతం ద్వారా పరిచయం చేసిన ఘనత ఆయనది. 500కు పైగా కీర్తనలు రాశాలు. కర్ణాటక సంగీతంలో ఏడు ప్రాథమిక తాళాల్లో కృతులు చేసిన ఏకైక స్వరకర్త. 72 మేళకర్త రాగాలలో కృతులు రచించారు. సంగీత, వ్యాకరణ, జ్యోతిష్య, వాస్తు, వైద్యవిద్యలలో ఆరితేరారు. 1835 అక్టోబరు 21న పరమపదించారు.

దివాకర్ల వేంకటావధాని (వర్ధంతి)



'కళాప్రపూర్ణ' పురస్కార గ్రహీత దివాకర్ల వేంకటావధాని 1923 జూన్ 23న పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలంలో జన్మించారు. తిరుపతి వేంకట కవులలో ఒకరైన దివాకర్ల తిరుపతి శాస్త్రి ఈయనకు పినతండ్రి. పరిశోధకుడు, విమర్శకుడు. తెలంగాణలోని మారుమూల గ్రామాలలో ఉపన్యాసాల ద్వారా తెలుగుభాషా చైతన్యాన్ని కలిగించారు. 40కుపైగా గ్రంథాలను రచించారు. ఆంధ్ర మహాభారత పరిశోధన ముద్రణకు పీఠిక రాశారు. విద్యాసనాథ, కవిభూషణ, బిరుదులు పొందారు. 1986 అక్టోబరు 21న కన్నుమూశారు.

ఫరూక్ అబ్దుల్లా (పుట్టినరోజు)



జమ్ము కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ మాజీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా 1937 అక్టోబరు 21న జన్మించారు. జమ్ము కశ్మీర్‌కు ముఖ్యమంత్రిగా పలుమార్లు వ్యవహరించారు. కేంద్ర రెన్యూవబల్ ఎనర్జీ శాఖ మంత్రిగా 2009 నుంచి 2014వరకు కొనసాగారు. ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లా ప్రస్తుతం జమ్ము కశ్మీర్ సీఎంగా ఉన్నారు.

మాతా కరుణామయి (పుట్టినరోజు)



'అమ్మ' శ్రీ కరుణామయి 1958 అక్టోబరు 21న నెల్లూరు జిల్లా పెంచలకోనలో జన్మించారు. అసలు పేరు విజయేశ్వరీదేవి. హిందూ ఆధ్యాత్మికవేత్తలలో ఒకరుగా రాణించారు. మానవులపైనా, పశు పక్ష్యాదులపైనా, మొక్కలపట్ల కూడా ప్రేమగా ఉండాలని బోధించి ఆచరిస్తున్నారు. అంతర్జాతీయంగా పర్యటిస్తూ ధ్యానాన్ని బోధిస్తూ ప్రపంచశాంతికి పాటుపడ్డారు. ఆమె రమణమహర్షి భక్తురాలు. గ్రామీణ ప్రాంతాలలో విద్య, వైద్యం, వసతికోసం శ్రమిస్తూ ఇతరత్రా ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం

కదిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణ మందిరంలో సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవాన్ని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉచిత సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా సేవా సమితి అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింక్ వేవ్ వాకథాన్

» వర్షంలో సైతం సందడిగా



వాకథాన్ ప్రారంభంలో నటుడు ప్రకాశ్ బెళవాడి తదితరులు

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ కేన్సర్‌పై సమాజంలో చైతన్యం తెచ్చేందుకు ఏర్పాటు చేసిన పింక్ వేవ్‌లో భాగంగా నిర్వహించిక వాకథాన్ వర్షంలోనూ ఉత్సాహంగా సాగింది. గ్లెనిగల్ బీజీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రన్ అడిక్ట్, రోటరీ జ్ఞానాక్షి, రోటరీ 3191, ఎస్‌జేబీ కళాశాల మేనేజిమెంట్ స్టడీస్ సహకారంతో ఆదివారం వాకథాన్ ఏర్పాటు చేశారు. 2వేలమందికిపైగా పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ ఉదయం ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండడంతో వెయ్యిమంది దాకా పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో పేరొందిన నటుడు, దర్శకుడు ప్రకాశ్ బెళవాడి వాకథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కొత్త జబ్బులు వస్తున్నాయని అందుకు తగినట్టుగా ఆధునాతనమైన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు ముఖ్యమన్నారు. పింక్ అక్టోబరు పేరిట దశాబ్దకాలంగా బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పించేలా వాకథాన్ నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ సింధు మాట్లాడుతూ పింక్‌వేవ్ పేరిట 9ఏళ్లుగా కేవలం వాకథాన్‌తో సరిపెట్టలేదని భిన్నమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 30శాతంమందికి బ్రెస్ట్ కేన్సర్ రావడానికి జీవనశైలియే కారణమన్నారు. ఆరోగ్యకరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మద్యపానం, ధూమపానం వంటివి వీడాలన్నారు. జీవనశైలిలో మార్పు తెచ్చుకోవాలన్నారు. డాక్టర్‌లు రాజీవ్ విజయ్‌కుమార్, మాతంగి, ప్రేరణా నేసర్గి, గోవింద్ ఇరియాడ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. వివిధ సంస్థల అధ్యక్షులు ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు.

సర్జాపుర పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజ

దొమ్మసంద్ర, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా పరిధిలోని సర్జాపుర పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయుధపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది యూనిఫాంకు బదులుగా సంప్రదాయదుస్తుల్లో పాల్గొన్నారు. సర్జాపుర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ దసరా వేళ బందోబస్తు తదితర పలు కారణాలతో అప్పట్లో సాధ్యం కాకపోవడంతో ఆదివారం ఆయుధపూజ నిర్వహించామన్నారు. ప్రజలకోసం దుర్గాదేవిని ప్రార్థించినట్టు తెలిపారు. తాము వినియోగించే వాహనాలు కారు, జీప్, పిస్టల్, బందూకు, ద్విచక్రవాహనాలు, బేడీలు, కంప్యూటర్ ఇతరత్రా వాటికి పూజలు చేమన్నారు. ఇదే సందర్భంగా విచ్చేసిన ఉన్నతాధికారులు, పాత్రికేయులను ఆత్మీయంగా సత్కరించారు. ఆయుధపూజలో బెంగళూరు నగర జిల్లా ఏఎస్పీ నాగరాజు, ఆనేకల్ ఉప విభాగం డీఎస్పీ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయదుస్తుల్లో పాల్గొన్న పోలీసులు

దాడిపై పోలీసుల దర్యాప్తు

బంగారపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కుమార్తెకు విడాకులు ఇచ్చేందుకు సిద్ధమైన అల్లుడిపై మామ, అతడి సహచరులు దాడి చేశారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు బూదికోటె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తాలూకాలోని యళెసంద్ర గ్రామంలో శనివారం రాత్రి ఘటన జరిగింది. కుమార్తెను ప్రేమించి పెళ్లి చేసుకున్న అల్లుడు, ఇటీవల విడాకులు కోరుతూ కోర్టులో పిటీషన్ వేశారని, దీంతో ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుమార్తెను వేధిస్తుండడంతో భరించలేని తండ్రి వెంకటేశప్ప శనివారం రాత్రి ఇతరులతో కలసి అల్లుడిపై చాకుతో దాడి చేసి పరారయ్యాడు. గ్రామ శివారులోని గుడిసెలో నిద్రిస్తున్న వేళ అల్లుడు రాజశేఖర్, అతడి తండ్రి నారాయణప్పలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని బెంగళూరు విక్టోరియా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. గాయపడిన రాజశేఖర్ తెలిపిన మేరకు భార్య నేత్రావతి తండ్రి వెంకటేశప్ప, ఆయన బంధువులు కృష్ణ, విశ్వనాథ్, శ్రీనివాస్‌లు దాడి చేశారన్నారు. ఆదివారం ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రేణుకా యల్లమ్మ దేవాలయంలో విశేషపూజలు



ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బిళిశివాలె గ్రామంలో ఆదిపరాశక్తి రేణుకా యల్లమ్మ ఆలయంలో ఆదివారం విశేషపూజలు కొనసాగాయి. ఆలయ సేవాసమితి ట్రస్టు సభ్యులు పర్యవేక్షించారు. ప్రత్యేకపూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాల్లో యల్లమ్మదేవి ఆలయం ఒకటన్నారు. ఏటా నవరాత్రి ఉత్సవాలు ఇక్కడ వైభవంగా కొనసాగుతున్నాయన్నారు. ఈసారి కూడా దసరా వైభవం జరిగిందన్నారు. భక్తిగీతాల వాద్యగోష్ఠి భక్తులను అలరించిందని ఆలయ ట్రస్టీ సురేశ్ తెలిపారు. ఆలయాన్ని ఇంతవరకు మాజీ ఎంపీ కేసీ రామమూర్తి, రెడ్డిజనసంఘం ప్రముఖుడు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించి పునీతులయ్యారన్నారు.

సర్వర్ సమస్య - రేషన్‌కు ఇబ్బందులు

బంగారపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పౌర ఆహార సరఫరాలశాఖకు సంబంధించిన సర్వర్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్న తరుణంలో తరచూ సర్వర్ సమస్య తలెత్తుతోంది. దీంతో రేషన్ పొందేందుకు ప్రజలు గంటలతరబడి క్యూలో వేచియుండి ఇబ్బంది పడుతున్నారు. నాలుగైదు రోజులుగా క్యూలో వేచి ఉండడం, సర్వర్ లేకపోవడంతో బయోమెట్రిక్ పనిచేయక వాపసు రావడం సరిపోతోందని పలువురు కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నభాగ్య పథకం కింద బియ్యం పొందేందుకు సాధ్యం కావడం లేదని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. తాలూకా వ్యాప్తంగా పలు చౌకడిపోల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. తొలుత రాగి తగినంత నిల్వలు లేవు, దీంతో బియ్యం కూడా సరఫరా చేయలేదు. వర్షం కారణంగా రాగులు హాసన్‌నుంచి ఆలస్యంగా చేరుకున్నాయి. కాగా కొన్నిరోజులుగా ఉన్న సర్వర్ సమస్యను పరిష్కరించి రేషన్ పంపిణీకి వీలు కల్పించాలని డీలర్‌లు కోరుతున్నారు.



క్యూలో వేచియున్న ప్రజలు

వీరుడా.. వందనం

- నేటి నుంచి పోలీస్ అమరవీరుల వారోత్సవాలు
- 31 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైన పోలీస్‌శాఖ



జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ అమరవీరుల స్తూపం

అనంతపురం క్రైం, అక్టోబరు 20: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించే వారోత్స వాలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ సిద్ధమైంది. జిల్లా ఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో ఈనెల 21 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారు. దేశ సరిహద్దులో 1959 అక్టోబరు 21న చైనాతో జరిగిన ఘర్షణలో పదిమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దేశం కోసం ప్రాణాలొడ్డిన ఆ వీరుల త్యాగాన్ని స్మరిస్తూ ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

- సోమవారం అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు తదితర అసాంఘిక శక్తులతో పాటు విధినిర్వహణలో భాగంగా అల్లర్లు, అలజడుల్లో కీలక విధులు నిర్వర్తించి ప్రాణాలు అర్పించిన పోలీస్ సిబ్బందిని స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు.
- 22 నుంచి 30వరకు పోలీసు అమరవీరుల గ్రామాలను సందర్శించనున్నారు. వారు చదివిన పాఠశాలలకు వెళ్లి అమరుల ఫొటోలు పెట్టుకునేలా సూచిస్తారు. గ్రామంలో ఏదైనా పాఠశాల, రోడ్డు, తదితర అభివృద్ధి పనులకు అమరుల పేర్లు పెట్టేలని గ్రామస్థులను కోరుతారు. అనంతరం అమరుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పించి, వారి సేవలను కొనియాడనున్నారు.
- 24 నుంచి 27 వరకు పాఠశాలల విద్యార్థులు, పోలీసు పిల్లలకు రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైం, చా లెంజెస్ ఆఫ్ పోలీస్ ఇన్ ది ప్రెజెంట్ ఎ న్విరాన్‌మెంట్ అంశాలపై జిల్లా వ్యాప్తంగా చర్చావేదికలు, వ్యాసరచన పోటీలు నిర్వ స్తారు.
- 26 నుంచి 27 వరకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌తో పాటు సబ్ డివిజన్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల స్థాయిలో ఓపెన్ హౌస్‌లు నిర్వహించనున్నారు. పోలీసులు నిత్యం ఉపయోగించే ఆయుధాలు, సాధనాలు, పరికరాలను ప్రదర్శించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తారు. పోలీస్‌స్టేషన్లలో రికార్డుల నిర్వహణ గురించి తెలియజేస్తారు. డాగ్‌స్క్వాడ్‌కు సంబంధించిన పోలీసు జాగిలాలను మైన్‌గ్రూప్, వజ్ర, వాటర్ కేనన్ వాహనాలను ప్రదర్శనలో ఉంచనున్నారు.
- 28 నుంచి 30వరకు పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శనలు నిర్వహిస్తారు. పోలీసుల త్యాగాలపై సెమినార్లు/ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాటికలు, పాటల రూపంలో అమరుల త్యాగాలు వివరించనున్నారు.
- 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులను గుర్తించి వారికి సన్మానం చేసి, సేవలను ప్రశంసించనున్నారు.
- 31న సమైక్యతా భావాన్ని చాటుతూ ప్రజల సహకారంతో జిల్లా వ్యాప్తంగా సమైక్యతా దినం పాటించనున్నారు. సాయంత్రం 6గంటలకు పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నారు. దీంతో వారోత్సవాలు ముగుస్తాయి.

ఏడాదిలోపు పది మంది మృతి

జిల్లాలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు అనారోగ్యాలు, రోడ్డు ప్రమాదాల కారణాలతో పది మృతి చెందారు. వారిలో కానిస్టేబుళ్ల గోవిందప్ప, సురేష్, శ్రీరామ్ నాయక్, సుంకన్న, రాజశేఖర్, హాజీ పీరా, శ్రీనివాసులు ఉన్నారు. హోంగార్డులలో నాగప్ప, చెన్నప్ప, ఆంజనేయులు ఉన్నారు. వారికి నివాళులు, శ్రద్ధాంజలి ఘటించనున్నారు.

గ్రామీణ క్రీడలను కాపాడాలి



క్రీడల విజేతలకు సన్మానం

శిడ్లఘట్ట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో క్రీడలు ప్రముఖ పాత్ర వహిస్తాయని, క్రీడలకు వయోబేధం లేదని కర్ణాటక యువ సంఘసంస్థల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫణీంద్ర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని అబ్లూడు గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో జిల్లా పంచాయతీ చిక్కబళ్ళాపుర, యువజనులు, క్రీడల శాఖ చిక్కబళ్ళాపుర, రాష్ట్ర యువసంఘ సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి గ్రామీణ క్రీడోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గతంలో గ్రామాలలో పలు రకాలైన బృందాలుగా ఆడే క్రీడలు ఉండేవన్నారు. ఆధునీకరణ పేరిట ఇటీవలి కాలంలో గ్రామీణ క్రీడలు కనుమరుగైపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, యువకులు కూడా ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రాచీన క్రీడలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. దేశవాళీ క్రీడలను గ్రామస్తులంతా కలసికట్టుగా ఆడాలన్నారు. జాతీయ క్రీడాకారుడు జయంతి గ్రామ నారాయణస్వామి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా ప్రోత్సహించా లన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నాగమణి దేవరాజ్, ఉపాధ్యక్షుడు బీకే డివి కుమార్, సహనా బ్లాక్ సొసైటీ అధ్యక్షురాలు భారతి ఆంజినప్ప, గంగాధర బిన్నమంగల తదితరులు పాల్గొన్నారు.

గురువుకు శరణు కావాలి



ప్రసంగిస్తున్న ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం

చింతామణి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గురోపదేశంతోనే ఆత్మసాక్షాత్కారం సాధ్యమని గురువుకు శరణు కావాలని కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కైవార యోగినారేయణ మఠం నాదసుధారస వేదికపై ఏర్పాటైన ఆత్మబోధామృత ప్రవచనంలో పాల్గొని మాట్లాడారు. మానవజన్మ గొప్పదనాన్ని కైవారతాతయ్య తమ తత్వాలలో వివరించారన్నారు. నిత్యం గురువు గురించి ఆలోచించాలన్నారు. ఆత్మలో పరమాత్ముడు ఉన్నాడనే భావనతో నామాన్ని జపించాలన్నారు. అంతరంగంలో నామస్మరణ ద్వారా కంటికి రెప్పలా మనల్ని పరమాత్ముడి కాపాడతాడనే విశ్వాసం ఉందన్నారు. చావు పుట్టుకల నుంచి విముక్తి పొందేలా మోక్షజ్ఞానం అందించేశక్తి గురువుబోధనలతోనే సాధ్యమన్నారు. తొలుత సద్గురు తాతయ్య సన్నిధిలో శ్రీరామభవతారక మంత్రాన్ని సామూహికంగా పఠించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బస్ షెల్టర్‌ను బాగు చేయండి




పిచ్చిమొక్కలతో నిండిన బస్‌షెల్టర్

చేళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చాకవేలు గ్రామ పంచాయతీ పరిధిలోని చాకవేలు నుంచి శివపురం మార్గంలో గల తురకేసేపల్లి వద్ద బస్‌షెల్టర్ పిచ్చిమొక్కలతో నిండి ప్రయాణీకులకు ఉపయోగం లేకుండా మారింది. కళ్ళరేళ్ళపల్లి, కొత్తపల్లి, తురకేసేపల్లి గ్రామాల వారికి ఇదొక్కటే బస్‌షెల్టర్ ఉంది. స్వచ్ఛత కొరవడిన బస్‌షెల్టర్‌ను బాగు చేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

ధర్మవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఐఏఎస్ లక్ష్మయ్య అకాడమీ, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థ సంయుక్తంగా సివిల్స్ కోచింగ్‌పై మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. అందుకు అర్హుల ఎంపిక కోసం స్థానిక కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 120 మందికి గాను 25 మంది మహిళలు ఎంపికయ్యారు. వీరికి ఢిల్లీలో సివిల్ సర్వీస్ శిక్షణ ఇస్తారని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ తెలిపారు. మంత్రి సత్యకుమార్ జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడుతూ... తనను ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రిగా చేసిన నియోజకవర్గ ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో మహిళలకు ఈ శిక్షణ ఇప్పించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.91	1,612.18
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	51,587	406
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	51,407	9,934
సామర్థ్యం (టీఎంసీలు)	101.42	42.05

జిందాల్‌తో ప్రజారోగ్యానికి ముప్పు

- మితిమీరిన కాలుష్యం
- త్వరలోనే నిరసనలు: కాంగ్రెస్



కర్మాగారం నుంచి వస్తున్న పొగ

కంప్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుడితిని పట్టణం పక్కనే కురుగోడు రోడ్డులో వుండే జిందాల్ షా (శాత వాహన) ఫ్యాక్టరీతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడతూ జిందాల్‌షా ఫ్యాక్టరీ తీరుపై త్వరలో నిరసనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ ఫ్యాక్టరీ వల్ల దుమ్ముధూళి పొగ పూర్తిగా పట్టణంలోకి చేరుకుని ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఈ ఫ్యాక్టరీ వల్ల పట్టణంలో తినే ఆహారంలోకి దుమ్ముధూళి చేరుకుని టీబీ, ఆస్తమా ఇతర రోగాలకు గురవుతున్నారని తెలిపారు. దీనికి తోడు జెస్కామ్ అధికారుల అనుమతి లేకుండా భూమిలో విద్యుత్ లైన్లు తీసుకెళ్లి కర్మాగారాలు నడుపుతున్నారని ఆరోపించారు. దీంతో రైతులకు ప్రమాదాలు జరిగే అవకాశం వుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వరసిద్ధి వినాయకుడు

కంప్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలోని జోగికాలువ వద్ద వుండే వరసిద్ధి వినాయకుడికి సంకష్ట చతుర్థి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్లు, వెన్న, పూలతో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంకష్టమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు పూజారులు జడయ్యస్వామి తెలిపారు. పట్టణం, గ్రామాలు, క్యాంపు వాసులు పూజల్లో పాల్గొన్నారు.

కాలుష్య రహిత దీపావళి చేసుకుందాం

రాయచూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించుకుందామని జిల్లాధికారి నితీశ్ ఆదివారం ఒక ప్రకటన ద్వార ప్రజలకు పిలుపునిచ్చారు. ధ్వని కాలుష్యం, వాయు కాలుష్యం లేకుండా ప్రజలు దీపాల వెలుగులో పండగ జరుపుకోవాలన్నారు. దీపాల పేరుతో భారీ శబ్దాలు వచ్చే టపాసులను పేల్చడం వల్ల శబ్ద కాలుష్యంతో పాటు వాతావరణం కలుషితం కావడం వాయు కాలుష్యంతో ప్రజలు శ్వాస సంబంధ బాదులకు గురి కావడం వంటి ప్రమాదాలు ఎదురుకాకుండా ప్రజలు పర్యావరణ హితంతో పండుగలు జరుపుకోవాలన్నారు. కాలుష్యంలేని టపాకులు పేల్చి సంబరాలు జరుపుకోవాలన్నారు.



భువనేశ్వరీదేవికి పూజలు నిర్వహిస్తున్న కన్నడ అభిమానులు



కన్నడ రథయాత్ర చిత్రం

కన్నడజ్యోతి రథానికి ఘనస్వాగతం

బళ్లారి సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరానికి వచ్చిన కన్నడజ్యోతి రథానికి కన్నడ అభిమానులు ఆదివారం ఘనంగా స్వాగతించారు. డిసెంబరులో మండ్యలో జరగనున్న 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న కన్నడ జ్యోతి రథం బళ్లారి జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా కన్నడ జ్యోతి రథానికి నగరంలో జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానం ఆవరణలో ప్రముఖులంతా తరలివచ్చి కన్నడ తల్లి భువనేశ్వరీ విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గురురాజ్ మాట్లాడుతూ కన్నడ భాషాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భుజం భుజం కలిపి నిలవాలని, కన్నడను కాపాడి అభివృద్ధి చేసేందుకు ఇలాంటి కార్యక్రమం చేపట్టారని తెలిపారు. నగరంలోని మున్సిపల్ కళాశాల మైదానం నుంచి బయలుదేరిన ఊరేగింపు ప్రధాన వీధుల గుండా గవియప్ప సర్కిల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని చేరుకుంది.ఈ సందర్భంలో కన్నడ సాంస్కృతిక శాఖ ఉప సంచాలకులు నాగరాజు, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నిష్టి రుద్రప్ప, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివాజీరావు, వివిధ కన్నడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలను కించపరుస్తారా..?

- గాలి జనార్దన్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

బళ్లారి సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ప్రజలను కించపరుస్తూ మాట్లాడడం గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డికి తగదని, వారు లేకపోతే నీకు రాజకీయ జీవితమే లేదని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుడా మాజీ అధ్యక్షుడు హుమాయూన్ ఖాన్ మాట్లాడుతూ అణగారిన వర్గాలను కించపరిచి మాట్లాడం సరికాదు అని హెచ్చరించారు. జనార్దన్‌రెడ్డి వాల్మీకులు, దళితులు, బోవి, ముస్లింలను డస్ట్‌బిన్ అని వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొప్పళలో శివరాజ్‌తంగడి, గంగావతిలో ఇక్బాల్ అన్సారీని ఇలాగే మాట్లాడి అవమానించారని అన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే నాగేంద్ర గురించి కూడా వ్యాఖ్యలు చేస్తున్నారని, వాల్మీకి జాతి బలంగా ఉండడం వల్లే మీరు ఈ రోజు ఈస్థాయికి ఎదిగారని మర్చిపోవద్దని గుర్తు చేశారు. మీరు రాజకీయాల్లోకి రాకముందు ఏంటీ అనేది తెలుసుకోవాలన్నారు. ఒక క్రిమినల్ కేసులో పట్టుబడి నగరం విడిచిపెట్టిన నిన్ను రక్షించినది వాల్మీకి జాతి అనేది మరువద్దని హితవు పలికారు. నీ చుట్టూ ఉన్న వీరజాతి కోటను నిర్మించి శ్రీరాములు, నాగేంద్ర, సురేశ్‌బాబు, సన్నఫక్కీరప్ప, శాంతి తదితరులను నీ రాజకీయ చదరంగంలో పావులుగా వాడుకున్నావని మండిపడ్డారు. జిల్లాలో వరుసగా నాలుగుసార్లు గెలిచి మంత్రిగా ప్రత్యేకతను చాటుకున్న ఎమ్మెల్యే నాగేంద్రకు ఇప్పుడు వెన్నుపోటు పొడిచావని, వాల్మీకుల సత్తా ఏమిటో చూపిస్తాం అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మానయ్య మాట్లాడుతూ కన్నడ గడ్డపై తిని, కన్నడ గడ్డపై సరిహద్దులు ధ్వంసం చేసి కన్నతల్లికి ద్రోహం చేస్తూ కోట్లలో అక్రమ సంపాదనకు పాల్పడిన సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. దేశంలోనే తొలిసారిగా బెయిల్ డీల్ సృష్టించి మొత్తం న్యాయవ్యవస్థకే నల్లమచ్చ తెచ్చి పెట్టాడని తెలిపారు. సమావేశంలో నగరమేయర్ ముల్లంగి నందీశ్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు మానయ్య

వైద్యశిబిరానికి విశేష స్పందన



ఉచిత ఆరోగ్య పరీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

హొస్పేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : హొస్పేట నగరంలోని అంజుమన్ షాదీ మహల్ హాల్‌లో అంజుమన్ ఖిద్మాతే ఇస్లాం ఆధ్వర్యంలో గుండెజబ్బులు, నరాల వ్యాధి, క్యాన్సర్, కిడ్నీ స్టోన్, ఇతర వ్యాధుల కోసం ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా వచ్చిన వాల్మీకి సమాఖ్య అధ్యక్షుడు గుజ్జల శ్రీనాథ్ మాట్లాడుతూ ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్న అంజుమన్ కమిటీని అభినందించారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం వల్ల ఆర్థికంగా వెనుకబడిన వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హొస్పేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్, అంజుమన్ ఖిద్మతే ఇస్లాం కమిటీ ఛైర్మన్ హెచ్‌ఎస్ మహమ్మద్ ఇమామ్ నియాజీ, హుడా మాజీ అధ్యక్షుడు కొట్రేష్, ఇతర ప్రముఖులు పరశురామ్ నాయక్, వైద్యులు షోహన్, శరవణ్, అభిషేక్, వెల్లి రత్నం, జునైద్, అంజుమన్ సోసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కర్ణాటక రక్షణ వేదిక ఆధ్వర్యంలో

బళ్లారిరూరల్ : నగరంలోని రామేశ్వరనగర్‌లో కర్ణాటక రక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర సంచాలకుడు అర్దగిరి రామన్న, జిల్లా అధ్యక్షుడు ఉలిగప్ప నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరం పేదలకు అందుబాటులో వుంటుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రక్షణ వేదిక నాయకులు వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆనంద్, వెంకటేష్ చంద్రారెడ్డి, శ్యాంసుందర్, గురు, తిప్పే స్వామి, ఆలయ వ్యవస్థాపకుడు శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.



శిబిరంలో వైద్యులు, కర్ణాటక రక్షణ వేదిక సభ్యులు

ఘనంగా వాల్మీకి జయంతి



నడివి గ్రామంలో వాల్మీకి జయంతి నిర్వహిస్తున్న గ్రామస్థులు

సిరుగుప్ప, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : తాలూకా పరిధిలోని నడివి గ్రామంలో ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. వాల్మీకి తత్వ సిద్ధాంతాలను పాటించాలని గ్రామ ప్రముఖులు దేవరాజు నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నడివి వాల్మీకి సమాజం నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేద్దాం

కంప్లి : ఈ నెల 24న కంప్లి పట్టణంలో వాల్మీకి భవనం ప్రారంభోత్సవం సందర్భంగా వాల్మీకి జయంతిని రాజనహళ్లి వాల్మీకి పీఠాధీశ్వరులు ప్రసన్ననందాస్వామి, ఎమ్మెల్యే గణేష్ నేతృత్వంలో జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కంప్లి వాల్మీకి సమాజం తాలుకా అధ్యక్షులు నారాయణప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం ఉద్భవ గణపతి ఆలయం నుంచి వాల్మీకి భవనం వరకు స్వామివారిని ఊరేగింపు చేపడుతున్నట్లు తెలిపారు. వాల్మీకి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ చాటి చెప్పాలన్నారు. ఈ ఊరేగింపులో వేషభూషణలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితరాలు వుంటాయని తెలిపారు. కంప్లి, కురుగోడు, వాల్మీకి సమాజం పదాధికారులు ప్రతి ఒక్కరుఈ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రక్తదానానికి ముందుకురావాలి: డీహెచ్ఓ



రక్తదానం చేసిన వారిని సన్మానిస్తున్న వైద్యాధికారులు

బళ్లారి సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. బళ్లారి నగరంలో ఆదివారం జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ సహకారంతో డీహెచ్ కార్యాలయంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్ఓ మాట్లాడుతూ నేడు చాలా మంది గర్భిణులకు రక్తం అవసరం ఉందన్నారు. చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. వారిని కాపాడేందుకు తక్షణం రక్తం అవసరం అవుతుందన్నారు. దీన్ని అధిగమించేందుకు రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో యువత తమ అభిమాన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుల పేరు మీద రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరిస్తున్నారని వివరించారు. అదే స్ఫూర్తితో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 29సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన కర్ణాటక రాష్ట్ర యాక్టీవ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవి చెళ్లగుర్కిని సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇంద్రాణి, గిరీశ్, ఉపాధ్యాయుడు రామాంజనేయులు, రక్తదాతలు, వారి బంధువులు పాల్గొన్నారు.

కార్మికుల సదస్సును విజయవంతం చేయండి



జాతాలో మాట్లాడుతున్న సోమశేఖర్‌గౌడ, దేవదాసు

బళ్లారి సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మైసూరులో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించే ఏఐయూటీయూసీ రాష్ట్ర స్థాయి కార్మిక సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ తెలిపారు. దీనికి ముందస్తుగా బళ్లారి జిల్లా స్థాయి జాతా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆదివారం బెళగల్లు, జానెకుంటే, హరగిండోని, కుడితిని తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికుల జీవనం అతలాకుతలమయిందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో నానా అవస్థలు పడుతున్నార అన్నారు. జిల్లా అధ్యక్షుడు దేవదాసు మాట్లాడుతూ కాంట్రాక్టు వ్యవస్థ పేరుతో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ యాజమాన్యాల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక చట్టాలను అమలు చేస్తోందన్నారు. ఏఐయూటీయూసీ నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమంలో ఓ సన్నివేశం

బళ్లారి సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కన్నడ సాంస్కృతికశాఖ, సాంస్కృతిక సముదాయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నగరంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు కళాకారులు తమ ప్రతిభను ఆవిష్కరించారు. నగర పాలక సంస్థ బాలికలు, బాలుర బాలమందిర్ బృందాలు చేసిన జానపద నృత్యం జానపద ప్రేమికులను ఎంతగానో అలరించింది. సింధువాలా గ్రామానికి చెందిన పరమేశ్, సిరుగుప్పకు చెందిన వీరేశ్ దళవాయి సంగీత కచేరీ ప్రజలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో హోసూరు విద్యార్థినికి చోటు



భవ్యను అభినందిస్తున్న నిర్వాహకులు

హోసూరు అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరానికి చెందిన విద్యార్థిని స్కేటింగ్‌లో రాణించి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. హోసూరు కార్పొరేషన్‌లోని జూజూవాడి రోజానగర్‌లో నివసించే లీలావతి, కుమార్ దంపతులకు కుమార్తె 16 ఏళ్ల భవ్య ప్రైవేట్ పాఠశాలలో పదకొండో తరగతి చదువుతోంది. విద్యార్థిని ప్రతిరోజూ స్పీడ్ స్కేటింగ్ సాధనతో ప్రపంచ రికార్డు సృష్టించింది. 48 నిమిషాల్లో 24 కిలోమీటర్ల దూరం సాగి సత్తా చాటుకుంది. భవ్య హోసూరులోని ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో తర్ఫీదు పొందింది. ఆదివారం హోసూరులో ఇండియా బుక్ఆఫ్ రికార్డ్స్, ఇండియా నేషనల్ హ్యూమన్ రైట్స్, ఇండియా నేషనల్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ ఫౌండర్ అండ్ నేషనల్ ప్రెసిడెంట్ అంబాసిడర్ డాక్టర్ సదాం హుసేన్ సంఘం అధ్యక్షతన జరిగిన స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు.

హెల్మెట్‌పై విస్తృత ప్రచారం

రాయచూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ దరించాలంటూ పోలీసులు విస్తృత ప్రచారం ప్రాచారం ప్రారంభించారు. ఇటీవల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపధ్యంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ దరించి రావాలని లేదంటే జరిమానాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇందుకు సంబంధించి మైకుల ద్వార ఆదివారం నుంచి విస్తృత ప్రచారం చేపట్టారు. బైకు నడిపే వారితో పాటు వెనక్కి కూర్చున్న వారు కూడా తపన్పనిసరిగా హెల్మెట్ దరించాలని నవెంబరు 1 నుంచి ఈ నిబంధనను ఖచ్చితంగా అమలు చేస్తామని ఉల్లంఘించిన వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



ప్రచారం నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హోసూరు జోన్

రాగి తీగలు చోరీ - యువకుడి అరెస్ట్

హోసూరు(క్రైం) అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హోసూరు అలసనత్తం కొత్తగిరి రోడ్డు లక్ష్మీనరసింహనగర్‌కు చెందిన మురుగన్ సెల్ ఫోన్ టవర్ సెక్యూరిటీ మేనేజర్ గా పనిచేస్తున్నాడు. జీవానగర్‌లోని సెల్ ఫోన్ టవర్‌లోని రాగి తీగలను ఓ బాలుడు దొంగిలిస్తున్న సమయంల్లో చెన్నైల్లోని సంబంధిత సెల్ ఫోన్ కంపెనీకి అలారం మోగింది. దీంతో వారు బాగలూరు ఏరియా సెక్యూరిటీ అధికారి మురుగన్‌కు సమాచారం అందించారు. ఘటనపై బాగలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి రాగితీగలను దొంగలిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు కర్ణాటక రాష్ట్రం మాలూరుకు చెందిన వాడని తెలిసింది. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం

హోసూరు అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని నేతాజీ రోడ్డులో వెలసిన కోదండరామ దేవాలయంలో లోక కల్యాణార్థం కోసం చండీయాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రతి సంవత్సరం ఇలా యాగాలు నిర్వహిస్తున్నారు. గత 15 ఏళ్లుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో 10 ఏళ్లలోపు బాలికలను దేవతగా పూజించి వారికి పాదపూజ చేయడం ఆనవాయితీగా ఉంది. పాల్గొన్న భక్తాదులందరకి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయినాథ్, నీలకంఠన్, కేశవన్, ఆలయ అర్చకులు రఘురామన్, రవి, రఘు, రమేశ్, యోగేశ్, రాజేంద్రన్ సూర్యగణేశ్, భక్తాదులు పాల్గొన్నారు.



చండీ యాగంలో పాల్గొన్న భక్తులు

జాతీయ రహదారికి లింక్ రోడ్లను నిర్మిస్తాం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నరసింహన్ థామ

హోసూరు అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల డిమాండ్ మేరకు హోసూరు సమీపంలోని ఎస్‌టీఆర్ఆర్ జాతీయ రహదారికి లింక్ రోడ్లను నిర్మించేలా చర్యలు చేపడతామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నరసింహన్ థామ స్పష్టం చేశారు. రైతుల డిమాండ్లకు స్పందించి ఎస్‌టిఆర్ఆర్‌గా పిలిచే కనెక్టింగ్ శాటిలైట్ టౌన్ రింగ్ రోడ్డు నేషనల్ హైవేపై యాక్సెస్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎంపీ నరసింహన్ హామీ ఇచ్చారు. కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు రోడ్డు నుంచి తమిళనాడులోని మదగొండపల్లి, తళి రోడ్డు, కెలమంగలం, రాయకోటని కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు రోడ్డునుంచి చెన్నై జాతీయ రహదారిల్లోని బాగలూరు రోడ్డు మీదుగా విమానాశ్రయానికి కలుపుతూ ఈ ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును జాతీయ రహదారుల శాఖ చేపడుతోంది. 288 కి.మీ పొడవునా ఈ రోడ్డు పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేనున్నారు. బెంగళూరులోని అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానించబడినందున ఈ రహదారి చాలా ముఖ్యమైన మార్గం. తమిళనాడులోని బాగూరు మల్లసంద్రం, అత్తూరు అలసపల్లి, బటవరనపల్లితో పాటు దాదాపు 25 పంచాయతీ గ్రామాల మీదుగా 44 కిలోమీటర్ల మేర ఈ రహదారిని నిర్మిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం కోసం చుట్టుపక్కల సారవంతమైన వ్యవసాయ భూమి చాలా వరకు సేకరించబడింది. ఈ రహదారిని నిర్మించే ప్రాజెక్టు ప్రారంభం కాగానే ఈ రహదారికి లింక్‌రోడ్లు నిర్మిస్తామని రైతులకు హామీ అనంతరం సాధ్యం కాదని అధికారులు తెలిపారు. దీంతో రైతులు చేపట్టిన నిరసనతో బీజేపీ నాయకులు స్పందించి చొరవ చూపారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ నరసింహన్ నేతృత్వంలోని బృందం మల్లసంద్రం, అత్తూరు సహ బాధిత ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి సమావేశం నిర్వహించారు. అనంతరం రైతు ప్రతినిధులతో కలసి న్యూఢిల్లీకి వెళ్లి కేంద్ర భూ ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్‌ద్కరికి వివరించడంతో రైతులు కోరిన విధంగా 44 కి.మీ మేర యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కృష్ణగిరి జిల్లా బీజేపి అధ్యక్షుడు నాగరాజ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకేలోకి పలువురి చేరిక

హోసూరు అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హోసూరు అన్నాడీఎంకే నార్త్ యూనియన్ కార్యదర్శి, జిల్లా పంచాయతీ కమిటీ సభ్యుడు రవికుమార్ నేతృత్వంలో పలువురు పార్టీలోకి చేరారు. 80 మందికి పైగా కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నాడీఎంకేలో చేరారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి అందరికీ పార్టీ కండువాలతో స్వాగతించారు. హోసూరు యూనియన్ కమిటీ అధ్యక్షుడు శశి వెంకటస్వామి, హోసూరు యూనియన్ కమిటీ సభ్యుడు ఉమా గుణశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు